బస్సులు పునరుద్ధరించాలి

బీజేపీ నాయకుల రాస్తారోకో



నర్సాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు, బీజేపీ నాయకులు

నర్సాపూర్: పట్టణం నుంచి పటాన్‌చెరు వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం శివనగర్, నాగారం, రాళ్లకత్వ, సోలక్‌పల్లి తదితర గ్రామాల ప్రజలు నర్సాపూర్‌లోని బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేయగా, వారికి మురళీయాదవ్ సంఘీభావం తెలిపి రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సాపూర్ పటాన్‌చెరు మార్గంలో అనేక గ్రామాలు ఉన్నాయని, బస్సులు నడిపిన నర్సాపూర్ డిపో అధికారులు గత నెల నుంచి బస్సులు రద్దు చేయడంతో మార్గంలోని అనేక గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఇబ్బందుల పాలవుతున్నారని ఆరోపించారు. మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణమని చెప్పి బస్సులు రద్దు చేస్తే ఎలా అని ప్రశ్నించారు. బస్సులు లేక విద్యార్థులు కాలినడకన పాఠశాలలకు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. పై మార్గంలో బస్సు సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని మురళీయాదవ్‌తో పాటు ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. రాస్తారోకో చేస్తున్న వారి వద్దకు ఆర్టీసీ సిస్టం ఇన్‌చార్జి వెంకట్‌గౌడ్, కంట్రోలర్ రాంప్రసాద్‌లు వచ్చి సమస్యను తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామన్నారు. ఆయా మార్గంలో రహదారిపై గుంతలు ఎక్కువగా పడినందున బస్సును రద్దు చేశారని, రోడ్డు బాగు చేయిస్తే బస్సు నడుపుతారని వివరిస్తూ రాస్తారోకో విరమించాలని నచ్చచెప్పగా రాస్తారోకో విరమింపచేశారు. రాస్తారోకోలో కౌన్సిలర్ రాజేందర్, బీజేపీ నాయకుడు రమణరావు, ప్రేంకుమార్, ఆయా గ్రామాల నాయకులు రాజు, భాస్కర్, యాదగిరి, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నిజాంపేటలో కల్యాణ లక్ష్మి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్‌జోన్: కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు వరమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. శుక్రవారం పట్టణంలో 116 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్, మండల ఎంఆర్ఓ లక్ష్మణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 71 మంది లబ్ధిదారులకు మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేందర్‌రెడ్డి, హఫిజుద్దీన్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, పరశురామ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో సబ్ మార్కెట్ యార్డులో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 78 కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఆర్ఐ గంగాధర్, కాంగ్రెస్, అమరసేనారెడ్డి, మారుతి, నశిరుద్దీన్, లింగం గౌడ్, వెంకటేష్ గౌడ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి: తహసీల్దార్

అల్లాదుర్గం(మెదక్): ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రతీ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మల్లయ్య చెప్పారు. శుక్రవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు, రైతులు ఎలాంటి సమస్యలు ఉన్న ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

భూములు కాపాడండి

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి గౌరి అన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని బండపోసాన్‌పల్లి గ్రామంలో శ్మశానవాటిక స్థలం, గోదల మందగా పలవబడే సర్వే నం.149లోని ప్రభుత్వ భూమి కబ్జాపై గతంలో ఫిర్యాదుచేసినా..అధికారులు స్పందించలేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలు కాపాడాలని కోరారు.

తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం కార్యదర్శిగా శ్రీకాంత్‌రెడ్డి

నిజాంపేట(మెదక్): తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం కార్యదర్శిగా శ్రీకాంత్ రెడ్డి ఎన్నికైనందున నిజాంపేట రెడ్డి యువత ఆధ్వర్యంలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి యువ నాయకులు వెంకటరెడ్డి, నవీన్ రెడ్డి, భరత్ రెడ్డి మాట్లాడారు.

ఆరు నెలలుగా నీళ్లు రావడం లేదు



మున్సిపల్ వైస్ చైర్మన్‌కు తమ బాధను వివరిస్తున్న ప్రజలు

నర్సాపూర్: తమకు సుమారు ఆరు నెలలుగా నీళ్లు సరిగా రావడం లేదని నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరు, ఏడో వార్డుకు చెందిన ప్రజలు ఆరోపించారు. శుక్రవారం ఉదయం రెండు వార్డులకు చెందిన పలువురు మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్ ఇంటికి వచ్చి తమ గోడును వివరించారు. తమకు మిషన్ భగీరథ నల్లాల ద్వారా సరిగా నీళ్లు రావడం లేదని ఆరోపించారు. నయిమొద్దీన్ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి అందరికీ నీళ్లు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో వారు వెళ్లిపోయారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ నాగేశ్వర్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో వాష్ ఎన్ఈఓ సహకారంతో ఐటీసీ మిషన్ సునేహ్రా కల్ ఆధ్వర్యంలో కార్యదర్శులకు, పంచాయతీ సిబ్బందికి ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి ప్రోగ్రాం అధికారి సాగర్, ఏపీఓ అనీల్‌కుమార్, వాష్ ఎన్‌జీఓ ప్రాజెక్టు అధికారి విజయ్, తదితరులు ఉన్నారు.

విద్యుత్ వైర్లను తొలగించండి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలని శుక్రవారం రైతులు నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామ శివారులో వ్యవసాయ పొలాలకు సంబంధించిన విద్యుత్ వైర్లు ప్రమాతభరితంగా కిందికి వేలాడుతున్నా.. సంబంధిత విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. అటువైపుకు మనుషులు, పశువుల వెళ్లకుండా రైతులు రాళ్లు అడ్డుగా పెట్టామని, ప్రమాదకర వైర్లను తొలగించాలని పలుమార్లు విద్యుత్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఏఈ సాయి కుమార్ దృష్టికి తీసుకెళ్లగా.. ప్రమాదంగా ఉన్న విద్యుత్ వైర్లను సరిచేస్తామని చెప్పారు.

నిందితులను శిక్షించాలి

నర్సాపూర్: అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని హోళియా దాసరి హక్కుల పోరాట సమితి రాష్ట్రమాజీ ప్రధాన కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లిలోని అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన అధికారులను కోరారు.

చిన్నశంకరంపేట(మెదక్): అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మైసయ్య కోరారు. శుక్రవారం ఆయన నార్సింగిలో మాట్లాడుతూ.. రోజుకో చోట అంబేడ్కర్‌కు అవమానం జరుగుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి కఠినంగా వ్యవహరించాలని కోరారు. దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని కోరారు.

గ్రామాల్లో ఫ్రైడే - డ్రైడే పరిశీలన



కొడిపల్లి(నర్సాపూర్): తునికిలో తొట్టిలో నీటిని తొలగిస్తున్న ఏఎన్ఎం, ఆశవర్కర్లు



నిజాంపేటలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో ఎల్లయ్య

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో శుక్రవారం జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య ఆకస్మిక తనిఖీ చేసి స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఫ్రైడే - డ్రైడే పరిశీలించారు. ప్రతీ ఒక్కరు నీటి చుట్టూ పక్కల నీటి నిల్వలు లేకుండా చూసేకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజిరెడ్డి, ఎంపీఓ ప్రవీణ్, గ్రామ కార్యదర్శి నర్సింలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ముసాద్దీక్ అన్నారు. ఆయన చిలప్‌చెడ్‌లో డ్రై డేలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం అధికారులు డ్రైడే నిర్వహించారు. కొడిపల్లి, తునికి, ధర్మాసాగర్ తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశవర్కర్లు నీరు నిల్వలేకుండా చూడాలని తెలిపారు.

ప్రగతి ధర్మారంలో..

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో పీహెచ్‌సీ సిబ్బంది ఫ్రైడే- డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సజీలుద్దీన్, పీహెచ్‌సీ డాక్టర్ హరిప్రియ నిల్వ ఉన్న నీటిని తొలగించి అవగాహన కల్పించారు.



నర్సాపూర్ రూరల్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

సంగాయిపేటలో..

కొల్చారం(నర్సాపూర్): పారిశుద్ధ్య పనుల్లో భాగంగా మండలంలోని సంగాయిపేట గ్రామంలో శుక్రవారం ఫ్రైడే- డ్రైడే నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సదాశివుడు, కారోబార్ విఠల్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

నర్సాపూర్ రూరల్: స్వచ్ఛతహీ సేవలో ప్రతీ విద్యార్థి పాల్గొనాలని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.దామోదర్ అన్నారు. డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పెద్ద చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. హెచ్ఎం ఇందిరా జ్యోతి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్: పట్టణంలోని కోర్టులో 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.అనిత కోరారు. శుక్రవారం కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసు, న్యాయవాదులు, బ్యాంకు అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఏపీపీ సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, లోక్ అదాలత్ బెంచ్ సభ్యుడు మధుశ్రీ, సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐలు లింగం, మైపాల్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, ఏఎస్ఐలు, ఎక్సైజ్ ఎస్ఐ అరుణ, పలువురు న్యాయవాదులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

నిజాంపేట(మెదక్): మండల వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులకు సదరం క్యాంపు అనేది మంచి అవకాశమని ఎంపీడీఓ రాజిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అర్హత గల దివ్యాంగులను గుర్తించే సదరం ధ్రువీకరణ ప్రతం పొందుటకు మీ సేవలో తేదీలను ప్రకటించిన్నట్లు తెలిపారు. 24 వరకు మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకొని ప్రభుత్వ ఆస్పత్రిలో హాజరు కావాలని తెలిపారు.

పోషకాహారంపై అవగాహన



చిలప్‌చెడ్‌లో మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సంతోషిమాత

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రం చిలప్‌చెడ్‌లోని ఐకేపీ కార్యాయలం వద్ద మహిళా సమాఖ్య సంఘం సభ్యులకు పోషకాహారంపై అవగాహన నిర్వహించామని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా సంతోషిమాత మాట్లాడుతూ.. మహిళలు పోషకాహారాలు తినాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ప్రేమలత, సీసీలు, ఆయా గ్రామాల మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): బాలికలు ప్రతీరోజు పోషకాహారం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ మండల సూపర్ వైజర్ సంతోష అన్నారు. శుక్రవారం మండలంలోని గూడూర్‌లోని కేజీబీవీలో విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజుల, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనం

జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనం శుక్రవారం గ్రామస్తులు, యువకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు.



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం నర్సంపల్లి పెద్దతండాలో..



నర్సాపూర్: వినాయకుడికి పూజలు చేస్తున్న నిర్వాహకులు

పిడుగుపడి ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం



అంబాజిపేటలో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమై చెలరేగిన మంటలు

చిన్నశంకరంపేట(మెదక్): ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో పిడుగుపడి పవర్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైన సంఘటన మండలంలోని అంబాజిపేట గ్రామపంచాయతీ వద్ద చోటు చేసుకుంది. ఈ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. శుక్రవారం మండలంలోని అంబాజిపేట గ్రామపంచాయతీ వద్ద పిడుగు పడడంతో 100కేవీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమయ్యాయి. అప్రమత్తమైన గ్రామస్తులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరాఫరాను నిలిపివేశారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తామని ట్రాన్స్‌కో ఏఈ సతీష్‌బాబు తెలిపారు.

ధరణి స్పెషల్ డ్రైవ్‌లో 23,126 దరఖాస్తులు



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి, అధికారులు

తూప్రాన్: ధరణి స్పెషల్ డ్రైవ్ ద్వారా డివిజన్ పరిధిలో 23,126 పరిష్కరించినట్లు ఆర్డీఓ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 12,912 దరఖాస్తులను ఆమోదించి, వారి పట్టాదారు పాసు పుస్తకాలలో నమోదు చేసినట్లు తెలిపారు. వచ్చే వారం రోజుల్లో పెండింగ్ దరఖాస్తులన్ని పరిష్కారం అవుతాయని తెలిపారు. పెండింగ్ దరఖాస్తుదారులు ఆందోళన చెందవద్దని, ఎక్కడికి పోవాల్సిన అవసరం లేదన్నారు. భూ సమస్యలపై రైతులు ప్రతీ సోమవారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంతో పాటు ఆయా మండల తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజావాణిలో సంప్రదించవచ్చు అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ఐకేపీ ఏపీఎం ప్రేమలత



మాట్లాడుతున్న ఏపీఎం ప్రేమలత



వెల్దుర్తి(తూప్రాన్): మాట్లాడుతున్న డీపీఎం మోహన్

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వారికి కావాల్సిన వనరులను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కల్పిస్తుందని చిలప్‌చెడ్ ఐకేపీ ఏపీఎం ప్రేమలత అన్నారు. శుక్రవారం మండల కేంద్రం చిలప్‌చెడ్‌లో మండల సమాఖ్య కార్యాలయంలో ఏడో వార్షిక మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐకేపీ ఏపీఎం ప్రేమలత మాట్లాడుతూ.. చిలప్‌చెడ్ మండల మహిళా సమాఖ్య 385 గ్రూపులతో కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సుధారాణి, ఉపాధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి రేణుక, సహాయ కార్యదర్శి హసీనాబేగం, సీసీలు , వీఓఏలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

వెల్దుర్తి(తూప్రాన్): మహిళలు సకాలంలో చెల్లించాలని డీపీఎం మోహన్ పేర్కొన్నారు. వెల్దుర్తి మహిళా సమైఖ్య భవనంలో నిర్వహించిన 16వ వార్శిక మహాసభ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం శంకరయ్య, మండల సమైఖ్య అధ్యక్షురాలు భవాని, సీసీలు కిషన్, సత్యం, రజిత, మహిళా సంఘాల గ్రూప్ లీడర్లు పాల్గొన్నారు.

తూప్రాన్: మండల మహిళా సమైఖ్య 20వ మహాసభ సమావేశం శుక్రవారం మండల సమైఖ్య కార్యాలయంలో మండల సమైఖ్య అధ్యక్షురాలు జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి మండల సమైఖ్య ఏపీఎం రుక్మిణీ హాజరయ్యారు. ఈ సమావేశంలో మండలంలోని ఆయా గ్రామ సంఘం కార్యవర్గం, గ్రామ సంఘం వివో, మండల సమైఖ్య సిబ్బంది, మండల సమైఖ్య కార్యవర్గం పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో ఐకేపీ ఆధ్వర్యంలో మహిళ సంఘాల సభ్యులు శుక్రవారం వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చిన్నారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, ఆయా గ్రామాల మహిళ సంఘాల అధ్యక్షులు, సీసీలు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంలో మహిళల పాత్ర చాలా గొప్పది: సీఐ రేణుక

పెద్దశంకరంపేట(మెదక్): సమాజంలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని అల్లాదుర్గం సీఐ రేణుక అన్నారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య 16వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక స్త్రీశక్తి భవన్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తహసీల్దార్ గ్రేస్‌బాయితో కలిసి మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, మద్య నిషేధం కోసం పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని, ఆడపిల్లలను చదివించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ వంశీకృష్ణ, ఎస్ఐ.శంకర్, ఏపీఎం గోపాల్, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఫౌజియా, సీసీలు, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సుస్థిర జీవనోపాధిని పెంపొందించుకోవాలి



హవేళిఘణాపూర్(మెదక్): మాట్లాడుతున్న అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సరస్వతి

హవేళిఘణాపూర్(మెదక్): మహిళలు సుస్థిర జీవనోపాధిని పెంపొందించుకోవాలని అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సరస్వతి అన్నారు. శుక్రవారం మెదక్ మండల సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు మాధవి ఆధ్వర్యంలో 16వ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎంపీడీఓ రఘు, ఐసీడీఎస్‌సూపర్వైజర్ మాధవి, ఏపిఎం ఇందిరా, సీసీలు, గ్రామ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు సీఏలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మున్నూరు కాపు సంఘం సిద్దిపేట జిల్లా కన్వీనర్‌గా యాదగిరి**

రామాయంపేట(మెదక్): మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ సిద్దిపేట జిల్లా కన్వీనర్‌గా రామాయంపేటకు చెందిన దేమె యాదగిరి నియమితులయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ మాజీ మంత్రి జోగు రామన్న చేతుల మీదుగా యాదగిరి నియామక పత్రం అందుకున్నారు.

◆ **రూ.500 లకే గ్యాస్ సిలిండర్**

అల్లాదుర్గం(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలో భాగంగా మహిళలకు రూ.500లకే సబ్సిడీ కింద గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు చెన్నప్ప, ప్రభు, వీరన్న చెప్పారు. శుక్రవారం బహిరన్‌దిబ్బ గ్రామంలో సబ్సిడీ సిలిండర్ బాండ్‌లను తహసీల్దార్ మల్లయ్య పంపిణీ చేశారు.

◆ **రేగోడ్ తహసీల్దార్‌గా నరేశ్**

రేగోడ్(మెదక్): రేగోడ్ నూతన తహసీల్దార్‌గా నరేశ్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన మెదక్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. కార్యాలయానికి వచ్చే రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పేర్కొన్నారు.

◆ **ఉపాధ్యాయ ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలి**

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయ ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎస్‌టీయూ అసోసియేట్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు అనారోగ్యం భారిన పడిన, ప్రమాదానికి గురైన లక్షల్లో ఖర్చుచేయాల్సి వస్తుందన్నారు.ప్రభుత్వం వెంటనే ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

◆ **దరఖాస్తులకు ఆహ్వానం**

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో తాత్కాలిక (హెచ్.బీ.టీ) టీచర్ పోస్టులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సాయిలు తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9908272419 ను సంప్రదించాలన్నారు.

◆ **పోటీతత్వం ఉండాలి**



చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగేందుకే నగదు ప్రోత్సాహకాలు అందజేశామని రాంచంద్రారెడ్డి ట్రస్ట్ చైర్మన్ జయరాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చండూర్ ఉన్నత పాఠశాలలో 2022-23, 2023-24 బ్యాచ్‌ల్లో మొదటి, రెండో స్థానం సాధించిన కావ్య, ప్రవల్లికలకు రూ.6 వేలు, మానస అంజలిలకు రూ. 5 వేల నగదు ప్రోత్సాకాలు అందజేశారు.

◆ **పేటలో మిలాద్-ఉన్‌నబీ ర్యాలీ**

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో మిలాద్-ఉన్‌నబీని పురస్కరించుకొని శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మహ్మద్‌ప్రవక్త సందేశాలు వినిపించారు.

తూప్రాన్: డివిజన్ కేంద్రంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు నిర్వహించారు.

◆ **బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు**

నర్సాపూర్: నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నట్లు తెలిపారు. కొల్చారం మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన బాలమణికి సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అందజేశారు.

◆ **సన్మానం**



చేగుంట(తూప్రాన్): జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను మండల కేంద్రంలో శుక్రవారం సన్మానించారు. ఎంపీడీఓ చిన్నారెడ్డి, ఎంఈఓ బుచ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.